క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో లక్ష్మీ నరసింహ స్వామి జయంతి



లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

టంగుటూరు: మండలంలోని జమ్ములపాలెంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జయంతి వేడుకలు బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి పంచామృత అభిషేకాలు, కుంకుమ, గొత్రనామార్చనలు తదితర విశేష పూజలు చేశారు. ఉభయదాతలు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి కళ్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేసి, రాత్రికి స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు.

ఉపాధి కూలీలకు మౌలిక వసతులు కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

హనుమంతునిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేసే కూలీలకు పని వద్ద మౌలిక వసతులు కల్పించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వెంగపల్లి, ఎలికవారిపల్లి గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో ఆయన మాట్లాడారు. కూలీలకు కల్పించిన మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కూలీలకు పని వద్ద తాగునీటి వసతి కూడా లేదన్నారు. పని వద్ద కూలీలకు టెంట్లు, పరదా పట్టలు, మజ్జిగ ప్యాకెట్లు, తాగునీటి వసతి కల్పించాలన్నారు.

విద్యార్థులు పుస్తక పఠనంపై దృష్టి సారించాలి

టంగుటూరు: పిల్లలు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని స్థానిక గ్రంథాలయ నిర్వాహకుడు వర్ధనరాజు సూచించారు. స్థానిక గ్రంథాలయంలో బుధవారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ.. వేసవి విజ్ఞాన శిబిరంలో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు పిల్లలకు కథలు, కథనాలు, సృజనాత్మక కృత్యాలు నేర్పిస్తున్నట్లు వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయానికి పంపాలని కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



పీసీపల్లి: మండల కేంద్రమైన పీసీపల్లి నుంచి మారెళ్లకు వెళ్లే మార్గంలో బుధవారం గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. విషయాన్ని ఎస్సై రమేష్ బాబుకు తెలియజేయగా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహంపై నలుపు రంగు చొక్కా మాత్రమే ఉంది. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహం పడి ఉన్న తీరు చూస్తే ఎవరైనా యాక్సిడెంట్ చేసి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైతు కళ్లలో ఆనందం

- కనిగిరి నియోజకవర్గంలో 189 మంది రైతులకు రూ.14.673 లక్షల పరిహారం
- రైతుకు పెట్టుబడి సాయంగా ఇన్‌పుట్ సబ్సిడీ



దెబ్బతిన్న పంటలు (ఫైల్)

కనిగిరి రూరల్: గతేడాది డిసెంబర్‌లో మిచాంగ్ తుఫాన్ ప్రభావం వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంది. ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల ఖాతాల్లో పంట నష్టపరిహార నగదు (ఇన్‌పుట్ సబ్సిడీ) జమ చేశారు. గత ప్రభుత్వాల హయంలో పంటలు సాగుచేసిన రైతులు నష్టపోతే పరిహారం పొందాలంటే కళ్లు కాయలు కాసేలా ఎదురుచూడాల్సి వచ్చేది. వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేది. కానీ, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వ్యవసాయ సిబ్బంది ద్వారా పంట సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు ప్రకృతి విపత్తులు, వైపరీత్యాల వలన నష్టపోయిన రైతులకు సత్వర న్యాయం, ఉపశమనం కలిగించే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక చర్యలు చేపట్టారు.

జిల్లాలో 3,775 మంది రైతులకు రూ.2.82 కోట్లు విడుదల...

జిల్లాలో 1,990 హెక్టార్లలో 8 రకాల పంటలకు నష్టం జరిగింది. వాటికి సంబంధించి 3,775 మంది రైతులకు రూ.2.82 కోట్ల నగదును విడుదల చేయగా, కనిగిరి నియోజకవర్గంలో 87.92 హెక్టార్లకు 189 మంది రైతులకు రూ.14.673 లక్షలు విడుదల చేశారు.

నియోజకవర్గంలో మండలాల వారీగా పరిహారం వివరాలు...

మండలం	హెక్టార్లు	రైతులు	పరిహారం (రూ.లక్షల్లో)
సీఎస్ పురం	50.28	113	8.845
కనిగిరి	5.60	13	0.952
పీసీ పల్లి	2.50	6	0.425
పామూరు	20.80	33	3.326
వెలిగండ్ల	8.74	24	1.486
	87.92	189	14.673

రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ



ప్రభుత్వం గతేడాది మిచాంగ్ తుఫాన్ ప్రభావం వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం విడుదల చేసింది. జిల్లాలోని 22 మండలాల్లో 8 రకాల పంటలు 1990.36 హెక్టార్లలో దెబ్బతినగా, వాటికి సంబంధించి 3,775 మంది రైతులకు రూ.2.82 కోట్లు విడుదల చేశారు. కనిగిరి నియోజకవర్గంలో రూ.14.673 లక్షలు విడుదలయ్యాయి. వాటిని రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ చేశారు.

– జీ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు ఎంతో అండగా నిలుస్తోంది. పంటలకు పెట్టుబడికి ఎదురుచూసే పరిస్థితి లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని ఏర్పాట్లు చేశారు. గతంలో అకాల వర్షాలకు, ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వాలు పట్టించుకునేవి కాదు. కానీ, నేటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్ రైతులకు అండగా నిలుస్తున్నారు. పంట నష్టపోయిన రైతులకు తక్షణ సాయంగా, ఉపశమనంగా నేరుగా రైతుల ఖాతాల్లోనే పరిహారం నగదు జమచేస్తున్నారు.

– నూరసాని మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

కష్టకాలంలో రైతులను ఆదుకున్నారు



పంటలు సాగు చేయడం కోసం రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో ప్రభుత్వం అందించిన సాయం ఎంతో ఉపయోగం. ఈ ఏడాది వర్షాలు ఊరిస్తున్నాయి. ఇలాంటి సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇన్‌పుట్ సబ్సిడీ అందజేయడం హర్షణీయం.

– దాదిరెడ్డి మాలకొండారెడ్డి, రైతు, గుడిపాడు, కొత్తపాలెం

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలి



వలేటివారిపాలెం: అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి హేమంత్ భరత్‌కుమార్



కందుకూరు: మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి వి రాము



గుడ్లూరులో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి రవికుమార్

● ఏఓ రాము

కందుకూరు: ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతుల్లో పంటలు సాగు చేసేందుకు రైతులు కృషి చేయాలని మండల వ్యవసాయాధికారి వీ రాము సూచించారు. మండలంలోని కోవూరు, పందలపాడు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో జరిగిన భూసార పరిరక్షణ అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ, జీవన ఎరువుల వినియోగం పెంచాలని సూచించారు. పచ్చిరొట్ట విత్తనాలైన పిల్లిపెసర, జనుము, జీలుగ పైర్లను పూత దశలో భూమిలో కలియ దున్నడం వల్ల భూమిలో కర్బన శాతం వృద్ధి చెంది స్థూల సూక్ష్మ పోషకాలు లభ్యమవుతాయని, నేలలో తేమ శాతం పెరిగి భూసారం పెరుగుతుందని వివరించారు. వ్యవసాయశాఖ నానో టెక్నాలజీతో తయారు చేసిన నానో యూరియా ఈ సీజన్‌లో అందుబాటులోకి వచ్చిందని, 500 మిల్లీ గ్రాముల నానో యూరియా ఒక బస్తా యూరియాతో సమానమని, పంటపై యూరియాకి ప్రత్యామ్నాయంగా పిచికారి చేయవచ్చునని తెలిపారు. అలాగే ప్రస్తుతం వ్యవసాయశాఖ ద్వారా 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలానికి జనుము 151 క్వింటాళ్లు, పిల్లిపెసర 34 క్వింటాళ్లు మంజూరయ్యాయని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు ముందుగా సంబంధిత ఆర్బీకేల్లో సంప్రదించి నగదు చెల్లించిన వెంటనే విత్తనాలు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు కే అభిషిక్త్, జీ రోజీ, రైతులు పాల్గొన్నారు.

భూసార పరిరక్షణపై అవగాహన

వలేటివారిపాలెం: మండలంలోని అమ్ముపాలెం, చుండి గ్రామాల్లో భూసార పరిరక్షణపై రైతులకు అవగాహన సదస్సు మండల వ్యవసాయ అధికారి హేమంత్ భరత్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హేమంత్ భరత్‌కుమార్ మాట్లాడుతూ సేంద్రియ పదార్థాలను వాడితే ఆరోగ్యవంతమైన భూమి తయారవుతుందని తెలిపారు. పచ్చరొట్ట ఇచ్చే పంటలైన జనుము, జీలుగా, పిల్లి పెసర కలియదున్నడంతో భూమి సారవంతం అవుతుందని, అలాగే పంటల దిగుబడులు అధికంగా ఉంటాయని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం రాయితీ పై పచ్చరొట్ట విత్తనాలైన జనుము, జీలుగా, పిల్లి పెసర అందజేస్తామని చెప్పారు. రైతులు రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవల్సిందిగా తెలిపారు. జీవన ఎరువులైన రైజోబియం, పీఎస్‌బీ వాడుకోవాలన్నారు. అలాగే పీఎమ్‌డీఎస్ ద్వారా నవధాన్యాలు భూమిలో సాగు చేసి వాటిని కలయదున్నటంతో భూమి సారవంతం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సీహెచ్ రవీంద్ర, నజ్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శివకుమారి, సుశీల రైతులు తదితరులు పాల్గొన్నారు.

భూసారాన్ని పెంపొందించుకోవాలి

లింగసముద్రం: భూసారం పరిరక్షణకు మండలంలోని పెదపవని-2, చినపవని రైతుభరోసా కేంద్రాల్లో బుధవారం మండల వ్యవసాయాధికారి టి.అబ్రహం లింకన్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రసాయన ఎరువులు తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. నేల ఆరోగ్యం, భూసారం పరిరక్షణకు పచ్చిరొట్ట పైర్లు సాగుచేసి పూత దశలో నేలలో కలియదున్ని ఎరువుగా ఉపయోగించాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏలు ఎస్‌కే ఇమ్రాన్ నజీర్, ఎస్‌కే అఫ్రీన్, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

గుడ్లూరు (ఉలవపాడు): ప్రతి ఒక్క రైతు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకుని భూమిని సారవంతం చేసుకోవాలని వ్యవసాయాధికారి రవికుమార్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని మోచెర్ల, పోట్లూరు, చెమిడిదపాడు గ్రామాల్లో భూసార పరిరక్షణపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు భూమిని నిరంతరం పరీక్షలు చేయించుకోవడం, మట్టి పరీక్షల అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ఝాన్సీ, వెంకటరావు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరశింహుని కళ్యాణం



తెట్టులో లక్ష్మీనరశింహుని కళ్యాణం

గుడ్లూరు (ఉలవపాడు): మండల పరిధిలోని తెట్టు కొండ పై వేంచేసి ఉన్న లక్ష్మీ నరశింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం కళ్యాణం వైభవంగా జరిగింది. వేదపండితులు, బ్రాహ్మణోత్తములు తాళిబొట్టును భక్తులకు చూపించి వారి ఆశీర్వాదంతో కన్నుల పండువగా కళ్యాణం జరిపించారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపిన తరువాత భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు.

వేణుగోపాలునికి బ్రహ్మోత్సవ సేవలు



పొన్నమాను ఉత్సవంలో వేణుగోపాలుడు



హనుమంత సేవలో వేణుగోపాల స్వామి

ఉలవపాడు: మండల కేంద్రమైన ఉలవపాడులో వెలసిన రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. బుధవారం తెల్లవారుఝామున హనుమంత వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా పొన్నమాను ఉత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం మోహినీ ఉత్సవం జరిపారు. ఆలయాన్ని విద్యుత్ వెలుగులతో అలంకరించారు. భరతనాట్యం భక్తులను అలరించింది. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

వాస్తవిక దృక్పథంతో రాసిన కావ్యం పాలపిట్ట



పాలపిట్ట పుస్తక పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కందుకూరు: ఎటువంటి వక్రీకరణలు లేకుండా సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ నేపథ్యాన్ని తెలియజేయాలనే ఉద్దేశంతోనే పాలపిట్ట దీర్ఘకావ్యం రాశారని రచయిత ముప్పవరపు కిశోర్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం పాలపిట్ట దీర్ఘకావ్యం పుస్తక పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలపిట్ట దీర్ఘకావ్యం పుస్తకం సాహిత్య విమర్శకుల ప్రశంసలు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. చారిత్రక నేపథ్యంలో రాసిన ఈ పుస్తకానికి పాఠకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని చెప్పారు. ప్రముఖ బుద్ధిస్టు, ఉపాసకుడు గాండ్ల హరిప్రసాద్ మాట్లాడుతూ కందుకూరు సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ నేపథ్యాన్ని సవివరంగా ఈ కావ్యంలో రచయిత పొందుపర్చారని, భవిష్యత్ తరాలకు, విద్యార్థులకు ఈ ప్రాంతం తెలుసుకునేందుకు కరదీపికగా పనిచేస్తుందని చెప్పారు. గ్రంథపాలకురాలు పీ నాగరజని మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలుగా నేటికీ కొనసాగుతున్నాయన్నారు. విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, వక్తృత, డ్రాయింగ్ పోటీలు, పుస్తక పరిచయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా ఈ ప్రాంత ప్రముఖ కవి, రచయిత ముప్పవరపు కిశోర్ రచించిన పాలపిట్ట దీర్ఘ కావ్యం పుస్తక పరిచయ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పుస్తకాన్ని ఆవిష్కరించి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ అంబేడ్కరిస్టు గేరా చిరంజీవి, లైబ్రరీ కమిటీ సభ్యులు చిల్లర సుబ్బారావు, ఎస్‌కే ఖాదర్ బాష, పగడాల రోశయ్య, ఎస్‌కే సలోవరు తదితరులు పాల్గొన్నారు.

తిరునాళ్ల నిర్వాహకులతో సీఐ సమావేశం



తిరునాళ్ల నిర్వాహకులు, గ్రామస్తులకు సూచనలిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

పీసీపల్లి: రాబోయే గంగ తిరునాళ్లలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. బుధవారం స్థానిక గంగమ్మ ఆలయ సమీపంలో ఆలయ నిర్వాహకులు, సమీప గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని 24 నుంచి జరిగే గంగ తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. తిరునాళ్లలో ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించదలచుకున్న వారు, ఆలయ నిర్వాహకులు, సమీప గ్రామస్తులతో చర్చించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల దృష్ట్యా కూడా ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు రూ.300 వేతనం



టంగుటూరులో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఏపీడీ వెంకటస్వామి

టంగుటూరు: ఉపాధి హామీ కూలీలకు వేతనం రూ.300 అందించాలని ఏపీడీ వెంకటస్వామి పేర్కొన్నారు. టంగుటూరు పంచాయతీ పరిధిలోని బాపూజీ కాలనీ, రాయివారిపాలెంలో ఉపాధి హామీ పనులను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏపీడీ కూలీల సంఖ్య పరిశీలించి, పని ప్రదేశంలో మంచి నీరు, ప్రథమ చికిత్స కిట్లు ఉంచాలని, కొలతల ప్రకారం కూలీలకు పని కల్పించి రూ.300 కూలి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏపీఓ సుభాషిణి, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



కె.ఉప్పలపాడులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ



పామూరులో స్వాధీనం చేసుకున్న పత్రాలు లేని ద్విచక్ర వాహనాలతో సీఐ, ఎస్సైలు



పామూరులో కలాం సెంటర్‌లో కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ, ఎస్సైలు

పామూరు: పామూరులో సీఐ ఎం.రామానాయక్ ఆధ్వర్యంలో బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానాస్పద ప్రాంతాలతో పాటు గృహాల్లో సోదాలు నిర్వహించారు. స్థానిక అబ్దుల్ కలాం సెంటర్‌లో నిర్వహించిన కౌన్సిలింగ్‌లో సీఐ రామానాయక్ మాట్లాడుతూ జూన్ 4వ తేదీ జరిగే కౌంటింగ్ దృష్ట్యా ఎవ్వరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, అనుమతులు లేకుండా ర్యాలీలు నిర్వహించినా, గ్రామాల్లో పాత కక్షలు పెట్టుకుని అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు చేపట్టడంతో పాటు రౌడీషీట్ నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు సృష్టించేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం ఉంటే పోలీసుల దృష్టికి తేవాలన్నారు. ఎవ్వరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే వారికి కఠిన శిక్ష ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పత్రాలు లేని 32 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో పామూరు ఎస్సై యం.సైదుబాబు, సీఎస్ పురం ఎస్సై యం.ప్రేమ్‌కుమార్, వెలిగండ్ల ఎస్సై శివ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

కందుకూరు: సార్వత్రిక ఎన్నికలు ముగిసి కౌంటింగ్‌కు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ అధికారులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. అల్లర్లు, గొడవలకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా బుధవారం కేంద్ర బలగాలతో కలిసి పట్టణంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజలు చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు, అల్లర్లు, వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అల్లర్లు, కవ్వింపు చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు ముందస్తుగా అవగాహన కల్పించేందుకు ఆ ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో శాంతి, భద్రతలను పరిరక్షించి ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీఐ నఫీజ్‌బాష, పట్టణ ఎస్సై ఆనందభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

కొండపి(సింగరాయకొండ): గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొండపి సీఐ వై.పాండురంగారావు హెచ్చరించారు. మంగళవారం ఉదయం కొండపి మండలం కె.ఉప్పలపాడు గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గృహాలను తనిఖీ చేసి అనుమానితుల వివరాలపై ఆరా తీశారు. సరైన పత్రాలు లేని 11 వాహనాలు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉన్నందున్న గ్రామల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అలాంటి వారి మీద రౌడీషీట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. భవిష్యత్‌ను పాడు చేసుకోకుండా గొడవలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో కొండపి ఎస్సై కృష్ణబాజీబాబు, పొన్నలూరు ఎస్సై రాజేష్, మర్రిపూడి ఎస్సై శివబసవరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేరంగుడిపల్లిలో...

కనిగిరి రూరల్: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని సీఐ దాసరి వెంకటేశ్వరరావు అన్నారు. డీఎస్పీ రత్నాకర రామరాజు ఆధ్వర్యంలో మండలంలోని పేరంగుడిపల్లిలో బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. నివాస గృహాల్లో తనిఖీలు నిర్వహించి అనుమానితులను ప్రశ్నించారు. సరైన పత్రాలు లేని మోటార్ సైకిళ్లు, ఇతర వాహనాలను గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్సై టీ త్యాగరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కె.బిట్రగుంటలో 12 బైకులు సీజ్

జరుగుమల్లి(సింగరాయకొండ): సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సీఐ దాచేపల్లి రంగనాథ్ తెలిపారు. జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట ఎస్టీ కాలనీలో బుధవారం ఉదయం తనిఖీలు నిర్వహించి, సరైన పత్రాలు లేని 12 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. జరుగుమల్లి, టంగుటూరు ఎస్సైలు వెంకటేశ్వరరావు, పున్నారావు, హెడ్ కానిస్టేబుల్ రమేష్, భాస్కర లింగం, రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



కె.బిట్రగుంటలో సీజ్ చేసిన బైకులతో పోలీసులు



పేరంగుడిపల్లిలో తనిఖీలు చేస్తున్న ఎస్సై త్యాగరాజు



కందుకూరు పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

కార్పొరేట్ విద్యా సంస్థల ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి

కనిగిరి రూరల్: విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్లు తీసుకోవడంపై విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ పవన్ కళ్యాణ్ అన్నారు. స్థానిక దర్శి చెంచయ్య భవన్‌లో బుధవారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన యూనిఫాం, బుక్స్‌ను ఆయా విద్యా సంస్థలు విక్రయించరాదన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే అడ్మిషన్లు చేపట్టాలన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తే ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.